క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి



అవగాహన కల్పిస్తున్న సత్యవాణి

తోటపల్లిగూడూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి సూచించారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ వరి సాగు లాభసాటిగా మారాలంటే ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలన్నారు. భూమి సారవంతం కావాలంటే పచ్చిరొట్ట విత్తనాలను పోలిన పీఎండీఎస్ కిట్లను పొలాల్లో చల్లుకోవాలన్నారు. ఈ కిట్లలో ఉన్న పలు రకాల విత్తనాలు భూసారాన్ని పెంచి పంట అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుందన్నారు. అలాగే యూరియా వాడకం గణనీయంగా తగ్గించుకోవచ్చొన్నారు. అనంతరం పలువురు రైతులకు సబ్సిడీపై పీఎండీఎస్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఎం రాజ్‌కుమార్, ఏడీఏ నర్సోజీరావు, రైతు సంఘం అధ్యక్షుడు గంగపట్నం రమణయ్య, వీఏఏలు పార్వతి, వినీల్, సుమంత్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

➡ **మనుబోలు:** రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించి నేల స్వభావానికి అనుగుణంగా ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య సూచించారు. మండలంలోని వెంకన్నపాళెం, పిడూరుపాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగంలో నియంత్రణ పాటించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ దివ్య పాల్గొన్నారు.

కోవూరు: మండలంలోని మోడేగుంట, లేగుంటపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలను కోవూరు సహాయ వ్యవసాయాధికారి అనిత పరిశీలించారు. ఏఓ నీరజ, వీఏఏ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



కోవూరు: పట్టణంలోని టీఎన్సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థుల సహాయార్థం నగదు ప్రోత్సాహకానికి క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ ముందుకొచ్చింది. ఈ ఏడాదిలో నిర్వహించిన ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన నలుగురికి రూ.పది వేల చొప్పున అందజేశారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సికిందర్, ఏరియా మేనేజర్ ఫిరోజ్, బ్రాంచ్ మేనేజర్ నవీన్‌కుమార్, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కృష్ణారెడ్డి, సమగ్ర శిక్ష పీఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జనాలు



మనుబోలు: మనుబోలులోని వివిధ మండపాల్లో కొలువుదీర్చిన బొజ్జ గణపయ్యలకు సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించి గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.

పనులపై ఆరా



వెంకటాచలం: మండలంలోని నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి ట్రస్ట్ ప్రతినిధులు యరపు నాగార్జునరెడ్డి, రవీంద్రారెడ్డి సందర్శించారు. జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంకా చేయాల్సిన పనుల గురించి ప్రధానోపాధ్యాయులు సీహెచ్ చలపతి, టీచర్లతో చర్చించారు.

రైతులకు శిక్షణ

పొదలకూరు: మండలంలోని తాటిపర్తిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల వినియోగం, అధిక మోతాదులో యూరియా ఉపయోగిస్తే కలిగే ప్రభావాలపై శాస్త్రవేత్తలు వెల్లడించారు. వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు, పురుగుమందుల వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెల్లూరు ఏడీఏ మారుతీదేవి, శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ, పొదలకూరు ఏడీఏ శివనాయక్, ఏఓ ప్రతాప్, హెచ్ఓ ఆనంద్, వీఏఏలు పాల్గొన్నారు.

వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి



పాతవెల్లంటిలో..



నివాళులర్పిస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) / (స్టోన్‌హౌస్‌పేట): దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతిని నగరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం, చిత్రపటాలకు నివాళులర్పించారు. వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టారు.

• నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురం సెంటర్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్నదానాన్ని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. డివిజన్ ఇన్‌చార్జి వెంగళరెడ్డి, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, పేర్నేటి కోటేశ్వరరెడ్డి, నాగసుబ్బారెడ్డి, నాగరాజు, రమణమ్మ, బాలురెడ్డి, కల్యాణ్, సలామ్, అస్లామ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

• ఐదో డివిజన్లో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదానాన్ని పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జి సానా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• కరెంటాఫీస్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. అల్లావుద్దీన్, రెహమాన్, సమీర్, కరిముల్లా, సుజాత ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: పొట్టేపాళెంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. నేతలు శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, కోటేశ్వరరావు, వెంకట్రావు, శ్రీనివాసులురెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• గొల్లకందుకూరులో నిర్వహించిన కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• పాతవెల్లంటిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు.



వెంకటేశ్వరపురం సెంటర్‌లో అన్నదానం



పొట్టేపాళెంలో..



గొల్లకందుకూరులో..

తాగునీటి సరఫరాలో సమస్యల్లేకుండా చర్యలు



సూచనలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యల్లేకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. 17వ డివిజన్లోని పార్థసారథినగర్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. డివిజన్ పరిధిలో నెలకొన్న తాగునీటి సరఫరా సమస్యను స్థానికులు తెలియజేయగా, ఇంజినీరింగ్ విభాగాధికారులతో చర్చించారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఫిర్యాదు అందిన నేపథ్యంలో వెంగళరావునగర్‌లో పర్యటించారు. వెంగళరావునగర్‌లోని అన్న క్యాంటిన్‌ను సందర్శించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

నగరాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యమిస్తూ కార్పొరేషన్ నిధులను వినియోగించనున్నామని, దుబారా ఖర్చులను ఇక నుంచి పూర్తి స్థాయిలో తగ్గించాలని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు.

• అడ్మిన్ కార్యదర్శుల లాగిన్లలో ఉన్న సేవా అభ్యర్థనలను వేగవంతంగా పరిష్కరించాలని కమిషనర్ నందన్ సూచించారు. రెవెన్యూ శాఖతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్వో వాసుబాబు, రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కృష్ణచైతన్య, రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, సమద్, రెవెన్యూ సూపరింటెండెంట్ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

6న చలో విజయవాడ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమాన్ని ఈ నెల ఆరున నిర్వహించనున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బాలాజీనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందజేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక విద్యార్థులకు సంబంధించిన ఏ సమస్యనూ పరిష్కరించలేదని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు విష్ణు, జీవన్, దావూద్ పాల్గొన్నారు.

బోధనేతర పనులను నిలిపేయాలి



సభ్యత్వ ప్రచారంలో ఎస్టీయూ నేతలు

నెల్లూరు (టౌన్): బోధనేతర కార్యక్రమాలతో బోధనకు ఉపాధ్యాయులు దూరమవుతున్నారని, వీటిని వెంటనే నిలిపేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ముత్తుకూరు, నెల్లూరు తదితర మండలాల్లోని పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ ప్రచారంలో ఆయన మాట్లాడారు. రకరకాల యాప్‌లు, ఆన్‌లైన్ పనులు, శిక్షణ తరగతులు, నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన పత్రాలు ఉపాధ్యాయులకు పరీక్షగా మారాయని చెప్పారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు మున్సిపల్ షాపులు సీజ్



నెల్లూరు(బారకాసు): నగరంలోని ఏసీ బిల్డింగ్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని మూడు షాపులు ఎంతో కాలంగా అద్దె బకాయిలను నగరపాలక సంస్థకు చెల్లించకపోవడంతో వీటిని రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. దాదాపు రూ.9.6 లక్షలకుపైగా చెల్లించకపోవడంతో కమిషనర్ నందన్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. షాపు నంబర్ 5 – రూ.6,20,256.. షాపు నంబర్ – 6 రూ.1,21,170.. నంబర్ 9 – రూ.2,22,453 మేర చెల్లించాల్సి ఉంది. ఆర్ఓ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై రౌడీషీటర్ హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): పాతకక్షలను మనస్సులో పెట్టుకొని వ్యక్తిపై హత్యాయత్నం చేసిన రౌడీషీటర్‌పై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ప్రగతినగర్ ఏ బ్లాక్ ఏడో వీధికి చెందిన మస్తాన్ ఏసీ మెకానిక్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రౌడీషీటర్ అబ్దుల్ మాజిద్‌తో పాతగొడవలున్నాయి. ఈ నేపథ్యంలో సారాయంగడి సెంటర్‌లోని ఓ కేఫ్ వద్ద మస్తాన్ తన స్నేహితుడు కలామ్‌తో సోమవారం రాత్రి మాట్లాడుతుండగా, అబ్దుల్ మాజిద్ అక్కడికొచ్చారు. పాత గొడవలను మనస్సులో పెట్టుకొని మస్తాన్‌పై దాడికి పాల్పడ్డారు. కిందపడేసి గుండెలపై కూర్చొని పక్కనే ఉన్న రాయితో తలపై బలంగా మోదారు. మస్తాన్ స్పృహ కోల్పోవడంతో చనిపోయాడని భావించి అక్కడి నుంచి మాజిద్ వెళ్లిపోయారు. గాయపడిన ఆయన్ను స్నేహితుడు కలామ్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై హత్యాయత్నం కేసును నమోదు చేశారు.

ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైమ్): గణేశ్ నిమజ్జన ఊరేగింపులో వ్యక్తిపై కొందరు దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. గణేశ్ నిమజ్జన ఊరేగింపులో మూలాపేటలోని శివాలయ వీధిలో నివాసం ఉంటున్న పెంచలదినేష్ సోమవారం తెల్లవారుజామున డ్యాన్స్ చేస్తుండగా, ఇస్కాన్ సిటీకి చెందిన మనోజ్‌చౌదరి కిందపడ్డారు. దినేష్ వల్లే పడిపోయానని భావించిన ఆయన తన స్నేహితులను పిలిపించి వాకర్స్ రోడ్డు గేట్ సెంటర్ వద్ద దాడికి పాల్పడి పరారయ్యారు. గాయపడిన దినేష్ ఆస్పత్రిలో చికిత్స పొంది చిన్నబజార్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో మహిళపై..

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళపై కోడలు, ఆమె బంధువులు దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వీఎమ్మార్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఖాసిం, అజీమా దంపతుల చిన్న కుమారుడు జిలానీకి నెల్లూరు రూరల్ మండలం మాదరాజుగూడూరుకు చెందిన ఓ యువతితో ఈ ఏడాది మే 25న వివాహమైంది. జిలానీ భార్య ఇంటి నుంచి సోమవారం మధ్యాహ్నం బయటకెళ్లి సాయంత్రం తిరిగొచ్చారు. ఎక్కడికెళ్లావని కోడల్ని అజీమా ప్రశ్నించగా, తన ఇష్టం ఎక్కడికైనా వెళ్తానని సమాధానమిచ్చారు. ఈ తరుణంలో అజీమాపై కోడలు, ఆమె అక్క భర్త అబ్దుల్ రఫీ, అతని స్నేహితుడు దాడి చేసి గాయపర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు.

నేత్రదానం



బాలసుబ్రహ్మణ్యం (ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని పుల్లారెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న చీదెళ్ల బాలసుబ్రహ్మణ్యం (67) తన నివాసంలో సోమవారం రాత్రి మృతి చెందారు. వాసవీ వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత సహకారంతో కుటుంబసభ్యుడు సుదర్శన్‌రావు అంగీకారంతో మృతుడి నేత్రాలను నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సరిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99124 70094, 99595 89321 నంబర్లను సంప్రదించాలని సునీల్ కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు మెడికల్ క్యాంపు నేడు

నెల్లూరు (టౌన్): విభిన్న ప్రతిభావంతులకు సంబంధించిన మెడికల్ క్యాంపును దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్లో బుధవారం నిర్వహించనున్నామని డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలువాయి, రాపూరు మండలాలతో పాటు నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 80 మంది సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఆరు నుంచి 14 ఏళ్లలోపు ఉన్న విద్యార్థులకు చెవి, కంటి, శారీరక, మానసిక విభాగాల వైద్యులు పరీక్షలు నిర్వహించనున్నారని వివరించారు. మరిన్ని వివరాలకు 91823 02220 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బీఎస్సెన్నెల్ ఫ్రీడమ్ ప్లాన్ పొడిగింపు

నెల్లూరు రూరల్: రూపాయికే సిమ్, 30 రోజుల పాటు రోజూ రెండు జీబీ డేటా, ఉచిత కాల్స్ పొందేందుకు గానూ రూపొందించిన బీఎస్సెన్నెల్ ఫ్రీడమ్ ప్లాన్‌ను ఈ నెల 15 వరకు పొడిగించామని టెలికామ్ డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ అమరేంద్రరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల స్పందన దృష్ట్యా పొడిగించామని వివరించారు. సమీపంలోని బీఎస్సెన్నెల్ సేవా కేంద్రం లేదా రిటైలర్లను సంప్రదించాలని సూచించారు.

సర్పంచ్‌లు, అధికారులకు నేటి నుంచి శిక్షణ

నెల్లూరు(పొగతోట): మహిళా స్నేహపూర్వక పంచాయతీలుగా ఎంపికైన పంచాయతీల్లోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వీఆర్వోలు, ముగ్గురు వీఓలు, ఏఎన్ఎంలకు థీమ్ – 9పై శిక్షణ కార్యక్రమాన్ని బుధ, గురువారాల్లో నిర్వహించనున్నామని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు వరకు నిర్వహించనున్నామని వివరించారు. శిక్షణకు హాజరయ్యేలా ఆయా మండలాల ఎంపీడీఓలు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ రాక రేపు

నెల్లూరు(అర్బన్): నగరంలో తహసీల్దార్లతో గురువారం నిర్వహించనున్న సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు హాజరుకానున్నారని సంఘ జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి, ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి డానియెల్ పీటర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవాబుదారీతనం.. పారదర్శకతతో కూడిన రెవెన్యూ పాలనలో తహసీల్దార్ల పాత్ర అనే అంశంపై సదస్సును నిర్వహించనున్నామని వివరించారు. ఏపీ జేఏసీ అమరావతి సభ్య సంఘాల సమావేశాన్ని నగరంలో శుక్రవారం నిర్వహించనున్నామని అల్లంపాటి పెంచలరెడ్డి తెలిపారు.

కాకాణితో మేయర్ భేటీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మేయర్ స్రవంతి, జయవర్ధన్ దంపతులు మంగళవారం కలిశారు. పలు అంశాలపై పార్టీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి తదితరులతో చర్చించారు.

వియానీ హోమ్‌కు చేయూత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): డైకస్‌రోడ్డు సెంటర్‌లోని వియానీ హోమ్‌లో కాస్మొటిక్స్‌ను మంగళవారం అందజేశారు. తమ తల్లి జయలక్ష్మి వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ స్వర్ణ రమేష్‌బాబు, సురేష్‌బాబు చేపట్టారు. పద్మజ, వివేకానంద వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చింతల అమరేంద్రరెడ్డి, పొన్నం రవిచంద్ర,, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, రాఘవేంద్రశెట్టి, డిస్ట్రిక్ట్ – 203 ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, సుబ్బారెడ్డి, హరిప్రసాద్, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు



నెల్లూరు(బృందావనం): ఎల్‌బీసీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో వాకర్స్‌కు ఉచిత వైద్యశిబిరాన్ని జెడ్పీ వాకర్స్ సంఘ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. దాదాపు 200 మందిని రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలకు చెందిన సూపరింటెండెంట్ రమణయ్య ఆధ్వర్యంలో పరీక్షించారు. అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రతిభ చూపిన ఆనందికి రూ.ఐదు వేల ప్రోత్సాహకాన్ని చలంచర్ల భాస్కర్‌రెడ్డి అందజేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి, చెంచయ్య, కృష్ణయ్య, ప్రసాద్, రాజగోపాల్, ఖాజామస్తాన్, రమణయ్య, హర్షవర్ధిని, రాణమ్మ, హరిసుధ తదితరులు పాల్గొన్నారు.

పీఎం యశస్వి స్కాలర్‌షిప్ దరఖాస్తులకు గడువు పొడిగింపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పీఎం యశస్వి పథకం ద్వారా స్కాలర్‌షిప్‌లను పొందేందుకు గానూ దరఖాస్తు గడువును ఈ నెల 15 వరకు పొడిగించారని బీసీ సంక్షేమ, సాధికారత అధికారి వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాప్ క్లాస్ కింద ఎంపిక చేసిన పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు గరిష్ఠంగా రూ.76 వేలు.. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల వారికి గరిష్ఠంగా రూ.1.25 లక్షల స్కాలర్‌షిప్‌ను అందజేయనున్నారని వివరించారు. గ్రేడ్, మార్కులు, వార్షికాదాయ ఆధారంగా ఎంపిక చేయనున్నారని పేర్కొన్నారు. రూ.2.5 లక్షల్లోపు వార్షికాదాయమున్న బీసీ, ఓసీ, మైనార్టీ, డీఎన్టీ విద్యార్థులు అర్హులని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో గల అనివెట్టి మండపంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. విశేష పూజలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో జరిపారు. అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.



వేడుకగా పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్ర ప్రతిష్ఠను మంగళవారం నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు తిరుమంజనం, మహాకుంభారాధన, ఆదివాసం, పవిత్ర సమర్పణ, మండలారాధన, నిత్యహోమం తదితరాలను జరిపారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.